23-1-90

# 'వెదురు'తో ఉనికి కాపాడుకుంటున్న నక్సలైట్లు

అడ్డతీగల, జనవరి 22 (న్యూస్‌టుడే): రాజమండ్రి ఏ.పి. పేపరుమిల్లు తూర్పుగోదావరి జిల్లా అడవుల నుండి ముడిసరుకుగా సేకరిస్తున్న వెదురు పీపుల్స్‌వార్ గ్రూపు తీవ్రవాదులకు వారి ఉనికిని కాపాడుకొనుటకు, ఉద్యమ పోరాటానికి ఆయువుపట్టుగా మారింది. వెదురు కూపు పనులకు పేపరుమిల్లు చెల్లిస్తున్న కూలీ రేట్లు పెంపుదల గురించి పీపుల్స్‌వార్ గ్రూపు నక్సలైట్లు ప్రతీ సంవత్సరం, వెదురుకూపు పనులకెళ్ళు గిరిజనులను ఉద్యమింపచేసి, సఫలీకృతులవడం గత ఆరు సంవత్సరాల నుండి జరుగుతున్నది.

ప్రభుత్వ అడవుల నుండి వెదురును ముడిసరుకుగా సేకరించుకొనుటకు దీర్ఘకాలిక ఒప్పందం కలిగియున్న పేపరుమిల్లు యాజమాన్యం ప్రతీ సంవత్సరం వెదురుకూపు పనులకు అటవీ శాఖ నుండి అనుమతి తెచ్చుకొని పనులుకుపక్రమించుటకు ముందుగా కూలీ రేట్ల పెంపుదల విషయంపై నక్సలైట్లతో ఒక ఒప్పందానికి రావడం గత సంవత్సరాల నుండి సాంప్రదాయమైంది. అన్నలు లేకపోతే మా కూలీ రేట్లు పెంచడం కూడా జరగదనే దృఢవిశ్వాసం వెదురుకూపు కార్మికులలో కూడా చోటుచేసుకొన్నది. గత సంవత్సరం ఐదు క్యూబిక్ మీటర్ల వెదురు నరుకుడుకు చెల్లించిన రేటు రూ. 115 లు కాగా ఈ సంవత్సరం ఆ రేటు రూ. 122 లకు పెంచబడింది. డ్రాగింగ్ రేటు రూ. 24 ల నుండి 28 లకు, దినసరి కూలి రేట్లు గత సంవత్సరం మహిళకు రూ. 17 లు, పురుషులకు రూ. 18 లు కాగా ఈ సంవత్సరం మహిళకు రూ. 18 లు, పురుషులకు రూ. 19 లు పెంచబడ్డాయి. లోడింగ్

(మిగతా 6 వ పేజీలో)

# ఉనికి కాపాడుకుంటున్న నక్సలైట్లు

..(మొదటి పేజీ తరువాయి)

మరియు అన్‌లోడింగ్‌లకు డిపో నుండి మిల్లుకు రూ. 80 నుండి రూ. 85 లకు, కూపు నుండి డిపోకు రూ. 76 ల నుండి రూ. 80 లకు పెంచబడటం జరిగింది. వంద వెదురు కట్టలు రీబండ్లింగ్ చేయడానికి కూపులో రూ. 13 ల నుండి రూ. 14 లకు, డిపోలో రూ. 12 ల నుండి రూ. 13 లకు కూలీ రేట్లు పెంచడం జరిగింది.

ఇది ఇలాఉండగా వెదురు కూపు పనులలో పాల్గొంటున్న అందరికీ వైద్య సదుపాయాలు కల్పించాలని పీపుల్స్‌వార్ గ్రూప్ నక్సలైట్లు గత కొద్ది సంవత్సరాల నుండి పోరాడుతున్నారు. ప్రతీ వెదురుకూపుకు ఒక ఆర్.ఎం.పి. డాక్టరును నియమించి, కొంతమంది ఆర్.ఎం.పి. డాక్టరులపై పర్యవేక్షణ బాధ్యత కలిగియుండి కూపు కార్మికులకు వైద్య సౌకర్యాలందించు విధంగా పట్టభద్రుడైన వైద్యుని నియమించాలని నక్సలైట్లు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. గ్రామాలలో వైద్యం చేసుకొంటున్న కొంతమంది వైద్యులను పేపరుమిల్లు వెదురుకూపు కార్మికులకు వైద్య సదుపాయాలందించుటకు నియమించడం జరిగింది కానీ పట్టభద్రుడైన వైద్యుడిని నియమించడం జరగలేదు.

ఇది ఇలాఉండగా వెదురుకూపు పనులలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని నక్సలైట్లు పేపరుమిల్లు యాజమాన్యంపై తీవ్ర వత్తిడి తెస్తున్నారు. వెదురును కూపులనుండి డిపోలకు, డిపోలనుండి రాజమండ్రి పేపరుమిల్లుకు రవాణా జరుగు సమయాలలో వెదురు రవాణా లారీలపై లోడింగ్, అన్‌లోడింగ్ కూలీలుగా ఉంటున్నవారు ఆ లారీలు తరచుగా ప్రమాదాలకు గురికావడంతో చనిపోవడం, వికలాంగులు కావడం జరుగుచున్నది. అయితే వెదురు కూపు పనులలో పాల్గొని ప్రమాదానికి గురైనవారి విషయంలో పేపరుమిల్లు యాజమాన్యం ఎటువంటి బాధ్యతా వహించకపోవడం ఇంతవరకూ జరుగుచున్నది. 1988 ఆగస్టులో అడ్డతీగల మండలం డి.కొత్తూరు గ్రామంలో వెదురు రవాణా లారీ తిరగబడుటవలన మరణించిన ఒక గిరిజనునకు పన్నెండు వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని నక్సలైట్లు పేపరుమిల్లు అటవీ కూపు పనులు పర్యవేక్షించు అధికారులకు హెచ్చరికలు చేసిన సంఘటన ఇటీవల జరిగినట్లు తెలిసింది.

ఇది ఇలాఉండగా వెదురుకూపు పనులలో చోటుచేసుకొనియున్న కొన్ని [illegible]కల వలన, అటవీ శాఖాధికారుల పర్యవేక్షణారాహిత్యం వలన వెదురు కూపులు అంతరించిపోయే ప్రమాదమున్నదని పలువురు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతీ వెదురు పొదలోను కనీసం ఆరు గడలు తప్పనిసరిగా వదిలివేయాలని, ఆరు లోపు వెదురుగడలున్న వెదురు పొదలును అసలు నరకకూడదనే నిబంధనలు గాలికొదిలివేసి పూర్తిగా వెదురు డొంకలను నరికివేయడం జరుగుచున్నది. అలానే వెదురు నరికేటప్పుడు భూమినుండి కనీసం ఆరు నుండి తొమ్మిది అంగుళాల మొదలు వదిలివేసి క్రాస్‌గా వెదురు నరకడం చేయాలని నిబంధన ఉన్నది. ఆ నిబంధన కూడా పట్టించుకొనడంలేదని దీనివలన వెదురు తిరిగి మొలకెత్తే అవకాశాలు సన్నగిల్లి వెదురుకూపులంతరించిపోయే అవకాశమున్నదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. వెదురు పొదలు నరుకుటకు అనుమతించబడిన కార్మికుడని పర్మిట్ ఇవ్వబడినవారే అటవీ కూపు నరుకు పనులు చేయుటకు అర్హత కలిగియున్నారు. అయితే ప్రస్తుతం, వెదురుకూపు పనులలో ఆ పద్ధతులవలంబించడంలేదు. ప్రతీ సంవత్సరం ఈ జిల్లా అడవుల నుండి లక్ష టన్నులకు పైగా వెదురును పేపరుమిల్లు ముడిసరుకుగా సేకరిస్తున్నది.